క్లుప్తంగా

దేవరగట్టులో విశేష పూజలు



మాళ మల్లేశ్వరస్వామికిపూజలు చేస్తున్న పూజారి

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, కుంకుమార్చన, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అబాకస్ పరీక్షల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని సన్‌రైజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం ఆదోనిలో జరిగిన జిల్లా స్థాయి అబకాస్ పరీక్షల్లో నైపుణ్యం ప్రదర్శించారు. అబాకస్ సీనియర్ లెవెల్‌లో పల్లవి, హరి ప్రణతి, పుష్పాంజలి, విజువల్వేషన్‌లో హసీనా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ రవిశేఖర్ తెలిపారు. జనవరి 9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారన్నారు.

నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న ఏఈ మయాంక్

మద్దికెర : డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ సూచించారు. మండల కేంద్రం మద్దికెరలో కెనరా బ్యాంక్ వద్ద జరుగుతున్న డ్రైనేజీ పనులు ఆదివారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకుడితో కలిసి పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని, బిల్లులు మంజూరు చేస్తామన్నారు.

ప్రైవేట్ కళాశాలల రాష్ట్ర ఈసీ సభ్యునిగా మాధవ్



మద్దికెర : రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీవిద్యా సాయి విద్యాసంస్థల కరస్పాండెంట్ యజ్ఞం వెంకట్‌మాధవ్ ఎంపికయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు విష్ణుతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపిన యజ్ఞం వెంకటమాధవ్ ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

రేపు మారెమ్మ కుంభోత్సవం



మారెమ్మ దేవి

హొళగుంద: మండల పరిధిలోని సమ్మతగేరి గ్రామంలో మారెమ్మ దేవి కుంభోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

అభ్యంతరాలు తెలపండి

ఆలూరు రూరల్: మండలంలోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎస్సీ సామాజికవర్గం జాబితా ఉంచామని.. అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ అన్నారు. ఎస్సీల జాబితాలో ఇతర సామాజికవర్గం వారి పేర్లు ప్రచురితమై ఉంటే వీఆర్వోకు వినతి రూపంలో తెలియజేయాలన్నారు. మార్పు చేసి మరోసారి జాబితాను ప్రచురిస్తారని తెలిపారు.

ఎస్సీ జాబితాపై అభ్యంతరాలకు అవకాశం

హొళగుంద: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఎస్సీ సామాజికవర్గ జాబితా ప్రదర్శించామని.. అభ్యంతరాలుంటే తెలపాలని ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. అర్జీల రూపంలో ఈ నెల 31వ తేదీలోగా వీఆర్వో లేదా పంచాయతీ సెక్రటరీలకు తెలియజేస్తే సరిచేస్తారన్నారు.

రైలు బండి ఆగేదెప్పుడండి !

- ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- రాజధానికి అర్ధరాత్రి ఒక రైలు మాత్రమే
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- సమస్యను విన్నవించినా పట్టించుకోని రైల్వే అధికారులు, పాలకులు



మద్దికెర రైల్వేస్టేషన్

మద్దికెర : మండల కేంద్రం మద్దికెర రైల్వే స్టేషన్ గతంలో కళకళలాడేది. ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ ఉండంతో స్టేషన్‌లో జనం రద్దీగా ఉండేది. ఈ స్టేషన్ నుంచి సుదూర ప్రాంతాలకు సంతోషంగా రాకపోకలు సాగేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కరోనా సమయంలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్ తీసివేశారు. అయితే ఇప్పటికే అదేతీరును కొనసాగిస్తున్నారు. ప్యాసెంజర్ రైళ్లు మాత్రమే ఆపుతున్నారు. దీంతో ప్రస్తుతం రైల్వేస్టేషన్ బోసిపోయింది. ఎక్స్‌ప్రెస్‌లు మద్దికెర స్టేషన్‌లోనూ నిలబెట్టాలని ఎమ్మెల్యే, ఎంపీలు పలుమార్లు రైల్వే అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఎక్స్‌ప్రెస్‌లో జర్నీ కోసం మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారు ఈ ప్రాంత ప్రజలు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పలుమార్లు గుంతకల్లు డీఆర్‌ఎంలకు వినతి పత్రం అందించారు. ప్రస్తుత కర్నూలు ఎంపీ నాగరాజుకు పార్టీలకతీతంగా ఆయా గ్రామాల నాయకులు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు. అయినా పాలకులు స్పందించడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గుంతకల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సిందే...

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో గుంటూరు, విజయవాడ, కాచిగూడ, హుబ్లీ, బెంగళూరులకు వెళ్లే ప్రయాణికులు గుంతకల్లుకు వెళ్లాల్సి వస్తుంది. దీంతో అదనపు వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. రైల్వే ఉన్నత అధికారులు స్పందించి అవసరమయ్యే రైళ్లను ఆపాలని మద్దికెర మండల ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రానికి దగ్గరలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి, మండలంలోని ప్రముఖ వైష్ణవ పుణ్య క్షేత్రం శ్రీరంగనాథస్వామి ఆలయాలకు దూర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వస్తుంటారు. రాజధానికి కేవలం ఒక రైలు మాత్రమే ఉంది. అయితే తెల్లవారుజామున 2 గంటలకు ఉండడంతో విజయవాడకు మధ్యాహ్నం 2 గంటలకు వెళ్తుంది. ఆ సమయంలో అక్కడికి వెళ్లినా ఏ పనులు జరగడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఉదయం కాచిగూడ– బెంగళూరు, విజయవాడ-హుబ్లీ, హౌరా– వాస్కోడగామా(వారంలో నాలుగు రోజులు) రైళ్లు సాయంత్రం వాస్కోడగామా– హౌరా (వారంలో నాలుగు రోజులు), హుబ్లీ– విజయవాడ, బెంగళూరు– కాచిగూడ ఎక్స్‌ప్రెస్ వైళ్లు ఆగేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. సంబంధిత అధికారులు స్పందించి ప్రస్తుతం నడుస్తున్న అమరావతి రైళ్లు ఆపాలని ప్రజలు కోరుతున్నారు.



డీఆర్‌ఎంకు విన్నవిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు (ఫైల్)

ఇబ్బందులు పడుతున్నాం

రైల్వే స్టేషను ఉన్నా రైలు ఆగడం లేదు. మా పిల్లలు దూరప్రాంతాల్లో చదువుతున్నారు. కళాశాలకు వెళ్లాలన్నా, మేము పనుల నిమిత్తం ఎక్కడికైనా వెళ్లాలన్నా గుంతకల్లుకు వెళ్లాల్సి వస్తుంది. రైళ్లు ఉన్నా నిలుపుదల వుండకపోవడంతో వెళ్లడానికి, రావడానికి కష్టంగా మారింది. రైలు నిలబడితే అందరికీ సౌకర్యంగా ఉంటుంది. పాలకులు స్పందించాల్సిన అవసరం ఉంది.

– వెంకటేశ్వరరెడ్డి, మద్దికెర.

ఆదాయం పెరుగుతుంది

ఎక్స్‌ప్రెస్‌లు స్టాప్ లేనందున ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమీప గ్రామాల ప్రజలు రైలు ప్రయాణం చేస్తారు. ఎక్స్‌ప్రెస్ నిలుపుదల ఉంటే రైల్వేకు ఆదాయం కూడా పెరుగుతుంది. సుదూర ప్రాంతాలకు ఎక్కువ శాతం రైళ్లలోనే ప్రయాణించేందుకు ఇష్టపడతారు. రైల్వే అధికారులు ప్రయాణికుల సమస్యలు దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కారించాలి.

– చొక్కాసునీల్ కుమార్, ఆపద్బంధుసేవా సమితి అధ్యక్షుడు, మద్దికెర

మూసుకుపోతున్న ఎల్లెల్సీ కాలువ

- నీట మునుగుతున్న పొలాలు, రోడ్డు
- కల్వర్టు నిర్మించాలని రైతుల వినతి



రోడ్డుపై పారుతున్న నీరు



తెక్కలకోట రోడ్డులో ఎల్లెల్సీ 56వ డీపీ కాలువకు వేసిన పైపులో కుంగిన దృశ్యం

హొళగుంద: మండల కేంద్రం నుంచి హొన్నూరు కొట్టాల వరకు నిర్మిస్తున్న తెక్కలకోట రోడ్డు మధ్యలో ఎల్లెల్సీ 56వ డీపీ కాలువకు వేసిన పైపులో పల నేల కుంగి గ్రావెల్, రాళ్లు పడున్నాయి. దీంతో నీరంతా పక్కనున్న పొలాలు, రోడ్డుపై చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆదివారం ఆయకట్టు రైతులు వాపోయారు. కాలువ నీరు వెళ్లేందుకు కేవలం సిమెంట్ పైపులు మాత్రమే వేసి కల్వర్టు నిర్మించకపోవడంతో పై నుంచి వచ్చే నీరు ముందు కెళ్లకుండా అక్కడే నిలిచిపోతున్నట్లు రైతులు తెలిపారు. ఈ మేరకు సమస్యను సంబంధిత ఇరిగేషన్ ఏఈ, కాంట్రాక్టర్, నాయకులు దృష్టికి తీసుకెళ్లారు. బీటీ రోడ్డుగా మారుస్తున్న ఈ మార్గంలో రైతులు పండించిన ధాన్యం ఇతర ఉత్పత్తులను సిరుగుప్పకు తీసుకెళ్తుంటారని అలాగే ఇతర పనుల కోసం భారీ వాహనాలు కూడా తిరుగుతాయన్నారు. డీపీ 56వ కాలువ నుంచి కింద ఉన్న పొలాలకు నీరు వెళ్లేందుకు కల్వర్టు నిర్మించకుండా సిమెంట్ పైపు వెయడం వల్ల పైన తిరిగే వాహనాల బరువుకు తట్టుకోలేక రోడ్డు కుంగిపోతుందని వాపోతున్నారు. సాగునీరు ముందుకెళ్లకుండా పొలాలు, రోడ్డుపై నిలిచిపోతున్నట్లు తెలిపారు. దీంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పైపులను తొలగించి కల్వర్టు నిర్మించిన తర్వాత తారురోడ్డు వేయాలని రైతులు కోరుతున్నారు.



పొలాల్లో నిలిచిన నీరు

రేపు మండల సర్వసభ్య సమావేశం

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 31న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామి రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని, అలాగే ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని సూచించారు.

ఈకేవైసీ తప్పనిసరి

ఆస్పరి: మండలంలోని రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని ఆస్పరి సొసైటీ సీఈఓ నరసింహులు తెలిపారు. సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు, రాయితీలు, రుణాలు అందుతాయన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

కోసిగి: మండల కేంద్రం కోసిగి కడపాళెం వీధిలోని బసవన్న కట్ట సమీపంలో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పరసాని కోసిగయ్య కుమారుడు పరసాని రామకృష్ణ(35) అనే వైఎస్సార్ సీపీ కార్యకర్త అనారోగ్యం బాధపడుతుండేవాడు. ఆయన కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తరుపున వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి కోసిగికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు.

కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్‌కు తాళం



కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్‌కు తాళం వేసిన దృశ్యం

కోడుమూరు రూరల్ : స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌కు ఆదివారం ఉదయం సిబ్బంది తాళం వేశారు. ఉదయం 11గంటల ప్రాంతంలో ఎక్సైజ్ స్టేషన్‌కు ఏకంగా తాళం వేసుకుని సిబ్బంది అంతా బయటకు వెళ్లిపోయారు. సీఐ మంజుల, ముగ్గురు కానిస్టేబుళ్లతో కలిసి వెల్దుర్తిలో తనిఖీల నిమిత్తం వెళ్లారు. ఈ సమయంలో ఎస్ఐతో పాటు, మరో కానిస్టేబుల్ డ్యూటీలో ఉన్నారు. అయితే వీరు సైతం ఏదో పనిపై వెళ్లాల్సి రావడంతో ఏకంగా స్టేషన్‌కు తాళంవేసినట్లు సమాచారం. సుమారు 30నిమిషాల పాటు స్టేషన్‌కు తాళం వేసివుండటాన్ని గమనించి ఎక్సైజ్ సీఐ మంజులు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. సిబ్బంది తనిఖీల నిమిత్తం వెళ్లారని, కాసేపట్లో వస్తారన్నారు.

12న హైస్కూల్ ప్లాటినం జూబ్లీ మహాసమ్మేళనం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్లాటీనం జూబ్లీ మహాసమ్మేళనం జనవరి 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆదివారం పట్టణంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచాని రఘునాథ్‌తో కలిసి పూర్వవిద్యార్థులు ప్లాటీనం జూబ్లీ వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. పాఠశాల, కళాశాల ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాటి నుంచి ఈ విద్యాసంస్థల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకొని ,వేడుకలకు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్లాటీనం జూబ్లీ వేడుకల ఆహ్వాన కమిటీ సభ్యులు శివ కుమార్ మాచాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరందేలా చూడాలి

కౌతాళం: చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చూడాలని ఇటీవల ఎన్నికైన తుంగభద్ర ప్రాజెక్ట్ చైర్మన్ టిప్పు సుల్తాన్‌ను హొళగుంద, కౌతాళం మండలాల రైతులు, నాయకులు కోరారు. మండల కేంద్రం కౌతాళంలో ఆదివారం ఆయనను స్థానిక నాయకులు, అధికారులతో పాటు హొళగుంద మండలం నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు కలిశారు. ఎల్లెల్సీ కౌతాళం, హొళగుంద మండలాల సెక్షన్లలో ఆయకట్టు రైతుల కష్టాలు, సాగునీటి ఇబ్బందులు ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కౌతాళం మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మండల కో ఆప్షన్ మెంబరు మాబుసాబ్, రిటైర్డ్ తహసీల్దార్ షేక్షావలి, రౌడూరు దస్తగిరి, హొళగుంద నాయకులు హుసేన్‌పీరా, టీపీ పీరన్న, సిద్దిక్‌సాబ్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పథకానికి మంగళం పాడే కుట్ర

ఆదోని టౌన్: ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు నాగరాజు ఆరోపించారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేద వారికి ఉచిత వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశ పెట్టారన్నారు. ఆ తరువాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసిందన్నారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయం రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని గుర్తు చేశారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి మంగళం పాడేలా చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయకుండా పథకాన్ని నిర్వీర్యం చేసే యోచనలో ఉందన్నారు. అంతే కాకుండా తాజాగా ఆరోగ్య బీమా అమలు చేస్తామని చెప్పడం దీనికి బలానిస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం స్పందించి పేదలకు ఉపయోగపడే పథకాన్ని సక్రమంగా అమలయ్యేలా చూడాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం

పత్తికొండ(తుగ్గలి) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ నిరంతర పోరాటాలు కొనసాగిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు అయిన సందర్భంగా స్థానిక చదువుల రామయ్య భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని ఏడాది పొడవునా పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు రాజాసాహెబ్, రామాంజినేయులు, ఎంపీటీసీ సభ్యుడు పెద్ద ఈరన్న, నాయకులు సురేంద్రకుమార్, కృష్ణ, ఉమాపతి, కారుమంచి తదితరులు పాల్గొన్నారు.

3న హాకీ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): సబ్ జూనియర్ బాలురు, బాలికల విభాగంలో హాకీ ఎంపిక పోటీలు స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జనవరి 3న నిర్వహిస్తున్నట్లు హాకీ కర్నూలు సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలురు, బాలికలు 2009 జనవరి1 వ తేదీ తరువాత పుట్టిన వారై ఉండాలని తెలిపారు. ప్రతిభ చాటిన వారు జనవరి 17 నుంచి 19 వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించనున్న హాకీ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రారంభమెప్పుడో..!

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1.75 కోట్లతో నిర్మాణం
- అందుబాటులోకి రాని నూతన భవనం
- ఇబ్బంది పడుతున్న రోగులు






స్కానింగ్ రూంను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ఓ మాధవి (ఫైల్), ఆలూరులో నిర్మించిన సీహెచ్‌సీ భవనం

ఆలూరు రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను ఆధునీకరించి వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులోకి తెచ్చింది. మండలానికి ఒక 108,104,102 వాహనాన్ని అందుబాటులో ఉంచింది. అలాగే ఫ్యామిలీ డాక్టర్ విధానంతో రోగుల ఇంటి వద్దకే వైద్యారోగ్య సిబ్బంది వెళ్లి రోగులకు వైద్య సేవలు అందించేవారు. ఇందులో భాగంగానే ఆలూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రూ.1.75 కోట్లు వెచ్చించి అన్ని వసతులతో నూతన భవనం, 30 పడకల వార్డును నిర్మించారు. ఆధునిక వైద్య పరికరాలు సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. నూతన సీహెచ్‌సీ భవన నిర్మించి ఏడాదవుతున్నా నేటికి భవనం ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేక ఆదోని, కర్నూలు, బళ్లారి ప్రాంతాలకు రెఫర్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సకాలంలో చికిత్స అందక రోగులు మార్గ మధ్యలో ప్రాణాలోదిన సందర్భాలు ఉన్నాయి.

ఇబ్బంది పడుతున్న రోగులు

గత ప్రభుత్వం హయాంలో రూ.1.75 కోట్ల నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) నిధులతో 2023 ఏడాది ఆగస్టులో అత్యాధునిక సౌకర్యాలతో ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నూతన భవనం నిర్మించారు. ఇందులో 30 పడకల వార్డు, ప్రసూతి గదితో పాటు అత్యవసర చికిత్స విభాగం, ల్యాబ్, అల్ట్రా సౌండ్ సిస్టం గది, ఈసీజీ, ఎక్సరే రూం ప్రత్యేక ప్రసూతి గదితో పాటు గాయాలకు చికిత్స చేసేందుకు ప్రత్యేక గదులను అత్యాధునికంగా నిర్మించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 30 పడకల వార్డు మాత్రమే కలదు. ఒక ప్రసూతి గది, పోస్టుమార్టం రూము ఉంది. ఆలూరు సీహెచ్‌సీ పరిధిలోని 4 మండలాల నుంచి ప్రమాదాల బారినపడిన రోగులను చికిత్స నిమిత్తం ఇక్కడికే తీసుకొస్తుంటారు.


రోగుల ఇబ్బందులు తీరుతాయి



ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యాధునికి పరికరాలతో పాటు అన్ని సౌకర్యాలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించాలి. ప్రమాదాలు సంభవించినా, ఇబ్బందికరమైన కాన్పుల కోసం ఆదోని,గుంతకల్లు, బళ్లారి ప్రాంతాలకు వెళ్తున్నాం. ప్రమాదాల సంభవించినప్పుడు గాయాలైన వారికి ప్రథమ చికిత్స మాత్రమే చేస్తున్నారు. అన్ని సౌకర్యాలతో నిర్మించిన ఆసుపత్రిలో వైద్యం అందితే రోగులు ప్రాణాలు కాపాడుకోవచ్చు.

–రాజు,ఆలూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులకు నూతన భవనం అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదనలు పంపించాం. అదనపు గదుల భవనం అందుబాటులోకి వస్తే క్లస్టర్ పరిధిలోని రోగులకు ఇబ్బంది ఉండదు. మహిళల కోసం ప్రత్యేకంగా గైనకాలజిస్టు వార్డు కూడా ఉంది. త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

–వాహిద్, డాక్టర్, సీహెచ్‌సీ ఆలూరు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

తుగ్గలి : మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1994–99) ఒకే వేదికపై కలుసుకున్నారు. విద్యనభ్యశించిన స్కూల్‌లోని దాదాపు 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ సంబరపడ్డారు. పాతజ్ఞాపకాలు గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రఫీమున్నీసాబేగం, ఉసేన్‌సాహెబ్, భూశప్ప, సురేష్, శ్రీనివాసులు, రాముడు, రంగను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి పూల మాలలతో సత్కరించారు.



గురువులను సభ వద్దకు తీసుకొస్తున్న పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రం వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (1989–90 బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దాదాపు 34 ఏళ్ల తర్వాత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలుకరించుకుంటూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపలు గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాలకు తమవంతుగా రూ.25 వేల జిరా క్స్ మిషన్‌ను అందజేశారు. అంతకు ముందు కర్నూలు నుంచి వచ్చిన అప్పటి గురువులు శంకరయ్య, నారాయణరెడ్డి, శేషఫణిశర్మ, హైమావతమ్మను మేళతాళాలతో ఊరేగింపుగా పాఠశాలకు వరకు తీసుకవచ్చారు. గురువులకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.



అప్పటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

దేవనకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979–80 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 44 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. అప్పటి గురువులైన భక్తవాత్సల్యారెడ్డి, కృష్ణ, ఉపాధ్యాయులను పిలిపించి సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థుల సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని, ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు.